క్లుప్తంగా

తులసీదళార్చన



తులసీదళాల అలంకరణలో వేణుగోపాలస్వామి

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి వేణు గోపాలస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారిని తులసీదళాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు అర్చకులు కె.రాంబాబు తెలిపారు. బలిజిపేటకు చెందిన కె.ఈశ్వరరావు దంపతులు తులసీదళాలను సమకూర్చినట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కాలువకు మరమ్మతులు



కాలువకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని కొండబుచ్చమ్మపేట గ్రామం వద్ద కోతకు గురైన కాలువ గట్టుకు ఇరిగేషన్ అధికారులు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. కోతకు గురవుతున్న వీఆర్ఎస్ కాలువ అనే శీర్షికతో ఆదివారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈ సురేష్, జేఈ శ్రీనివాసరావు ట్రాక్టర్లతో గ్రావెల్ తెప్పించి, కోతకు గురైన కాలువను కప్పివేయించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం జేస్తున్నారు.


వాటర్ బాటిళ్ల వితరణ



వాటర్ బాటిల్స్‌ను చూపిస్తున్న విద్యార్థులు

బలిజిపేట: నూకలవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీరామ్మూర్తి తన సొంత నిధులతో వాటర్‌బాటిల్స్, పౌచ్‌లు, స్పూన్స్, మిఠాయిలు పంపిణీ చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 63 మంది చిన్నారులకు ఒక్కొక్కరికి ఒక వాటర్ బాటిల్, పౌచ్, స్పూన్ చొప్పున పంపిణీ చేశారు. విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెంపొందించడం కోసం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం



సీతానగరం: కృష్ణాష్టమి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు స్వామివారి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వామిని పల్లకిలో ఉంచి నగర సంకీర్తన నిర్వహించారు. పలు ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు గీతాపారాయణ చేశారు.

వివాహిత అదృశ్యం

వీరఘట్టం: మండలంలోని బిటివాడ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యం అయినట్లు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ జి.కృష్ణంనాయుడు మంగళవారం తెలిపారు. ఈమెకు నాలుగు నెలల కిందట సంతకవిటి మండలానికి చెందిన ఓ అబ్బాయితో వివాహం జరిగిందని, మూడు నెలల క్రితం ఆషాడంలో పుట్టింటికి మీనాక్షి వచ్చిందన్నారు. ఈ నెల 23న ఇంటిలో ఎవరూ లేని సమయంలో మీనాక్షి వండవ సెంటర్‌లో ఆటో ఎక్కి వీరఘట్టం వైపు వెళ్తున్నట్లు బంధువుల అమ్మాయి చెప్పడంతో గత నాలుగు రోజులుగా ఆమె కోసం అన్ని చోట్ల గాలించినట్లు తెలిపారు. ఎక్కడా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వైద్యమో.. రామచంద్ర



పాచిపెంట పీహెచ్‌సీలో ఓపీ విభాగంలో క్యూలో నిలుచున్న రోగులు



పీహెచ్‌సీలో ఒకే టేబుల్‌పై ముగ్గురు గర్భిణిలను కుర్చోబెట్టి సెలైన్ ఎక్కిస్తున్న దృశ్యం

- విజృంభిస్తున్న విష జ్వరాలు
- ప్రతి ఇంట్లో జ్వర బాధితులు
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- సరైన వసతులు లేక అందని వైద్యం



మలేరియాతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



పీహెచ్‌సీకి వెళ్లేదారిలో నిలిచిపోయిన మురుగునీరు

పాచిపెంట: మండలంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగీ వంటి వ్యాధి లక్షణాలతో ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. సకాలంలో సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడుతున్నాయన్న సంబరం కంటే జ్వరాలు సోకుతున్నాయనే ఆందోళనే ప్రజల్లో ఎక్కువగా కనబడుతోంది. తీవ్ర జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతోనే వ్యాధులు విజృంభిస్తున్నాయని అంతా అంటున్నారు.

రోగులతో ఆస్పత్రులు కిటకిట

విషజ్వరాలతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడతున్నాయి. బెడ్లు, పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందించాల్సిన పరిస్థితి. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యం ఇదే అదనుగా రోగులను దోచేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల నివారణ చర్యలు శూన్యం

గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు దోమల నివారణపై సరైన చర్యలు చేపట్టలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దోమతెరలు పంపిణీ చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో దోమల మందు పిచికారీ, ఫాగింగ్ చేయాలని, దోమతెరలు పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

బెడ్ల సంఖ్య పెంచాలి



ఆస్పత్రికి రోజుకు సుమారు 150 నుంచి 170 మంది వరకు రోగులు వస్తున్నారు. ఆస్పత్రిలో కేవలం ఐదు బెడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గురికి వైద్యం అందించాల్సి వస్తోంది. ఒక్కోసారి టేబుళ్లపై కూర్చోబెట్టి వైద్య సేవలందిస్తున్నాం. రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషిచేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి ఆస్పత్రిలో బెడ్ల సంఖ్య పెంచితే బాగుటుంది.

– గంటా వెంకటరమణ, వైద్యాధికారి, పీహెచ్‌సీ పాచిపెంట

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోవుకు పూజలు చేస్తున్న భక్తులు

పార్వతీపురం: మండలంలోని అడ్డాపుశిల పంచాయతీ పిన్నింటి రామినాయుడువలస గ్రామంలో టీటీడీ, హిందూ ధర్మప్రచారపరిషత్ జిల్లా కన్వీనర్ శ్యామ్ సుందర్ పర్యవేక్షణలో శ్రీరామ భజన సేవా మండలి ఆధ్వర్యంలో మంగళవారం గోపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గోవును అలంకరించి పూజలు చేశారు. గోవులను పూజిస్తే సకల దోషాలు తొలగుతాయని భక్తులకు వివరించారు. ప్రజల్లో భక్తి భావం పెంపొందించేందుకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు గులిపల్లి చినతిరుపతి తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు సూర్యకుమారి, అన్నపూర్ణమ్మ, భాస్కరరావు, రేగయ్య, బుచ్చయ్య, నారాయణరావు, అప్పలనాయుడు తదితరులున్నారు.

గిరిజన యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: గత ఐదేళ్లగా గిరిజన ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతకు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంఘం, మైదాన ప్రాంతం గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, పల్ల సురేష్, రఘుపతుల శశిభూషణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యా సంస్థల్లో అడ్డగోలుగా గిరిజనేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు అన్యాయం చేయడం తగదన్నారు. తక్షణమే ఏకలవ్యలో ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతకు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగం కోల్పోయిన గిరిజన యువతి పువ్వల లావణ్య, గిరిజన నిరుద్యోగ యువత చెల్లూరి సీతారాం, పువ్వల విజయ్, తాడంగి రమేష్, పువ్వల సునీల్, మండంగి మురళి, ఆరిక చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలి



పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

బలిజిపేట: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందని ఎంఈఓ-1 సామల సింహాచలం అన్నారు. మండలంలోని బలిజిపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించి, వర్క్‌బుక్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. బోర్డుపై అక్షరాలు రాసి వాటిని విద్యార్థులతో చదివించారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని, ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఈ–పంట నమోదుతో అనేక ప్రయోజనాలు



అవగాహన కల్పిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు తాము సాగుచేస్తున్న పంటలను ఈ–పంటలో నమోదు చేసేందుకు వస్తున్న వ్యవసాయ సహాయకులకు సహకరించాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. లక్ష్మీపురం రైతు సేవా కేంద్రంలో ఈ–పంట నమోదుపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ–పంట నమోదు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సీతానగరం, బుడ్డిపేట, లక్ష్మీపురం, చెల్లన్నాయుడువలస గ్రామాల్లో ఈ–పంట నమోదు చురుగ్గా జరుగుతోందన్నారు. పొలం గట్లపై కూరగాయలు, కందిపంటల సాగు చేయడం వల్ల అదనపు ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు వరిచేని గట్ల చిక్కుడు, బెండ, వంగ పంటలు సాగు చేస్తున్నారని, తద్వారా ఇంటికి అవసరమైన కూరగాయలు ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ వినయ్‌కుమార్, వెటర్నరీ సహాయకులు పద్మావతి పాల్గొన్నారు.

స్పెషల్ ఫీజులు రద్దు చేయాలి

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న స్పెషల్ ఫీజులు రద్దు చేయాలని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివిధ అంశాల పేరు చెప్పి పేద విద్యార్థుల నుంచి రూ.2,250లు వసూలు చేయడం చాలా అన్యాయం. ప్రభుత్వ కళాశాలల్లో చదివేవారందరూ పేద విద్యార్థులేనని, కాబట్టి తక్షణమే ఈ స్పెషల్ ఫీజుల విధానం రద్దు చేయాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం

పార్వతీపురంటౌన్: పట్టణంలో పారిశుధ్య నిర్వాహణపై అధికారి యంత్రాంగం దృష్టి పెట్టకపోతే ప్రజలతో కలిసి ఉద్యమానికి సిద్ధమవుతామని పట్టణ పౌరుల సంఘం నాయకులు పాకల సన్యాసిరాజు హెచ్చరించారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంలో పాలకులు, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం పట్ల స్థానికులు వ్యతిరేకిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్న పాలకులు దీనిపై పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో లేదన్నారు. డంపింగ్ యార్డు సమస్యపై పాలకులు కనీసం స్పందించకపోవడం విచారకరమన్నారు. దీనిపై కౌన్సిల్ కూడా కనీసం నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారి యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జీఓ 117ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు సూర్యనారాయణ

వీరఘట్టం: విద్యా ప్రమాణాలు మెరుగుకు అడ్డంకిగా ఉన్న జీఓ 117ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్, నీలానగరం, తెట్టంగి, బిటివాడ, వండవ, కత్తులకవిటి, సంత–నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించారు. జీఓ 117 వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మధ్యంతర భృతి ప్రకటించాలని, నూతన వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని కోరారు.

సేంద్రియ సాగుతో ఆరోగ్యకరమైన పంటలు



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

సాలూరు రూరల్: సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని ఏడీఏ భారతి అన్నారు. శివరాంపురం గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉనికిని గుర్తించి రైతులను అప్రమత్తం చేశారు. తెగులు నివారణకు మోనోక్రోటోఫాస్ మందు పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పంటలు పండించడం మానవాళి మనుగడకు మంచిదన్నారు. కార్యక్రమంలో ఏఓ అనురాధ, గ్రామ సర్పంచ్ మోహన్, వీఏఏ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు ఏర్పాట్లు చేయండి

- జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఇసుక ర్యాంపులో ఇసుక తవ్వకాలకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. గురువారం నుంచి భామిని మండలం కాట్రగడ్డ ఇసుక రీచ్ నుంచి ఇసుక తీసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇసుక తవ్వకాన్ని నీటి పారుదల శాఖ అధికారులు చేపట్టాలని, వాహనాలను రవాణాశాఖ అధికారులు సమకూర్చాలని, సేకరించిన ఇసుకను స్టాకు పాయింటులో నిల్వచేయాలని ఆదేశించారు. ఇసుక సేకరించిన అనంతరం అమ్మకాలకు సంబంధించి ఇతర శాఖల అధికారులు సిబ్బందికి కేటాయించి వారికి అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. ఇసుక బుకింగ్ పాయింటు వద్ద రేట్ల వివరాలతో బోర్డులను ఏర్పాటుచేయాలని, పోస్టర్లు అంటించాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా ఇసుక బుక్ చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇసుక అమ్మకాలలో ప్రభుత్వం నిర్దేశించిన రుసుం తప్ప ఎటువంటి అదనపు వసూళ్లు చేయకూడదని స్పష్టం చేశారు. స్టాకు పాయింటు వద్ద సీసీ కెమెరాలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొమరాడ, సీతానగరం మండలాలలో ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు, వార్తలు వస్తున్నాయని, వాటిపై పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు కలిసి తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కె.హేమలతను ఆదేశించారు. సమావేశంలో జేసీ ఎస్.ఎస్.శోభిక, అడిషనల్ ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ, డీపీఓ బి.సత్యనారాయణ, వంశధార ప్రాజెక్టు ఈఈ రామచంద్రరావు, డీటీఓ ఎం.శశికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుప్పానాయుడు సేవలు ఎనలేనివి



సాలూరులో కుప్పానాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్.వై.నాయుడు, తదితరులు



పాచిపెంటలో కుప్పానాయుడుకి నివాళులర్పిస్తున్న కోరాడ ఈశ్వరరావు, తదితరులు

సాలూరు: కార్మికవర్గానికి, పీడిత ప్రజానీకానికి తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్పవ్యక్తి డాక్టర్ కుప్పానాయుడు అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్.వై.నాయుడు అన్నారు. మంగళవారం కుప్పానాయుడు వర్ధంతి సందర్భంగా సాలూరు, పాచిపెంట గ్రామాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా కేంద్రంగా గజపతినగరం, సాలూరు, దత్తిరాజేరు తదితర ప్రాంతాల్లో కార్మిక సంఘం, గిరిజన సంఘాలు విస్తరణకు, సీపీఎం బలోపేతానికి ఆయన ఎనలేని కృషి చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పాచిపెంటలో కుప్పానాయడుకి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు రాముడు, గణేష్, అంజలి, బోను గౌరునాయుడు, తిరుపతిరావు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కోసం వినతి



డీడీకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: అర్హత ఉండి, దరఖాస్తు చేసుకున్న ప్రతీ గిరిజన అభ్యర్థికి ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్ కోరారు. ఈమేరకు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రుక్మాంగదయ్యకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి గుర్తింపు, అనుభవం ఉన్న సంస్థ ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కోరారు. వీలైనంత వరకు జిల్లా కేంద్రం పార్వతీపురంలో శిక్షణ ఇస్తే అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గిరిజన అభ్యర్థులు పువ్వల సునీల్, ఆరిక చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

రూ.8 లక్షలతో సీసీరోడ్డు



గూడెంలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేపట్టాలని మండల ఇంజినీరింగ్ అధికారి జి.చంద్రమౌళీ అన్నారు. మండల కేంద్రంలోని గూడెంలో మంగళవారం పెదబోగిలి సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో రూ.8 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ కాలువ, సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ప్రజావసరాలకు అనుగుణంగా పెదబోగిలి మేజరు పంచాయతీ పరిధిలో ఉన్న బుడ్డిపేట, అప్పయ్యపేట, పెదబోగిలి, సీతానగరం గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు సంతోష్‌కుమార్, జె.గరికయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- ప్రధాన కూడళ్ల వద్ద విగ్రహాల తయారీ
- వివిధ ఆకృతులు, రంగుల్లో ఆకట్టుకుంటున్న ప్రతిమలు





విక్రయానికి సిద్ధంగా ఉన్న గణపతి ప్రతిమలు

పార్వతీపురం: వచ్చే నెల 7 నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలకు గణనాథుని ప్రతిమలు సిద్ధమౌతున్నాయి. గణపతి నవరాత్రి మహోత్సవాలంటే యువతలో ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది. గతంలో ఊరిలో రెండు మూడు ప్రాంతాలలోనే ఉత్సవాలు నిర్వహించేవారు. నేడు ప్రతీ వీధిలో భారీ మండపాలు ఏర్పాటు చేసి ధూంధాంగా ఉత్సవాలు నిర్వహించేందుకు యువత పోటీపడుతున్నారు.

పీఓపీ ప్రతిమలపై మొగ్గు

మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ) విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు అని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా.. పీఓపీ విగ్రహాల వైపే యువత ఆసక్తి చూపుతున్నారు. పట్టణంలో కొందరు కళాకారులు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పీఓపీ)తో ప్రతిమలను తయారు చేస్తున్నారు. మట్టి గణపతి విగ్రహాల కంటే ఇవి భారీ సైజులో ఉండటం, ఆకర్షణీయంగా ఉండటంతో పాటు తక్కువ ధరకే లభిస్తుండటంతో ఉత్సవ కమిటీలు వాటిని కొనుగోలు చేస్తున్నాయి.

విగ్రహాల తయారీలో రాజస్థానీలు

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమలు తయారు చేయడంలో రాజస్థానీ కళాకారులు సిద్ధహస్తులు. ప్రతీ పట్టణంలో, గ్రామాల కూడళ్లలో వీరు ఏళ్ల తరబడి ఇక్కడే ఉంటూ ప్రతిమలను తయారుచేస్తున్నారు. గణపతి నవరాత్రి సమయంలో గణపతి ప్రతిమలు, ఇతర సమయాలలో శ్రీకృష్ణుడు, వెంకటేశ్వర స్వామి, సాయిబాబా, ఆంజనేయస్వామి వంటి దేవుళ్ల ప్రతిమలతో పాటు ఫ్లవర్‌వాజ్‌లు, ఇతర గృహాలంకరణ వస్తువులు తయారుచేస్తూ జీవనం సాగిస్తున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి

ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ప్రతిమలను తయారుచేసే వృత్తిలో కొనసాగుతున్నాను. ఈఏడాది ప్రతిమల తయారీకి దాదాపు రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. రెండు అడుగుల నుంచి 10 అడుగుల ప్రతిమలను తయారు చేశాను. ఒక్కో ప్రతిమ ఆకృతిని బట్టి, రంగులను బట్టి రూ.2 వేలు నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. అన్నీ సజావుగా ఉంటే నష్టం లేకుండా ఉంటుంది. ప్రతిమల విక్రయంతో కుటుంబ పోషణకే సరిపోతుంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఆర్థికంగా స్థిరపడే అవకాశం ఉంటుంది.

– విజయ్, రాజస్థానీ కళాకారుడు, పార్వతీపురం పట్టణం